# రహస్యం

**ఉదయం సరిగ్గా పదకొండు గంటలయింది. వందన వీధి తలుపుకి తాళం వేసి రోడ్డుమీదకు వచ్చి ఆటోని పిలిచింది. తనని ఎవరైనా చూస్తున్నారేమోనని ఒకసారి అటూ-యిటూ చూసి తెల్సిన వాళ్లెవరూ కనబడకపోయేసరికి "హమ్మయ్య" అని నిట్టూర్చి ఆటో ఎక్కింది.**

ఆదివారం శ్రీధర్ యింట్లోనే వుంటారు! అందుకే ఒక్క ఆదివారం తప్ప మిగతా అన్ని రోజులు అదే టైముకి ఆటోలో వెళ్తుంది వందన. తనిలా రోజూ వెళ్లడం ఎవరైనా కనిపెట్టి భర్తకి చెప్తారేమోనని లోపల భయంగా కూడా వుంది!

ఆటో 'గాంధీ అనాధ శరణాలయం' ముందు ఆగింది. రోజూ అక్కడికి వెళ్లడం వలన ఆమెకి అక్కడివాళ్లు అందరూ బాగానే పరిచయం అయ్యారు. నేరుగా లోపలికి వెళ్లింది వందన.

అదొక వింత ప్రపంచం! చిట్టి-పొట్టి చిన్నారి పాపలు...! ముద్దొచ్చే ఆ బాలలే రేపటి పౌరులు! వాళ్ల ఆట-పాటల్ని; ముద్దు-మురిపాలని చూసుకోకుండా అలా నిర్దాక్షిణ్యంగా వదిలేసిన తల్లిదండ్రులు నిజంగా దురదృష్టవంతులు!

"అభి! అదుగో మీ ఆంటీ!" అంటూ అక్కడ ఆడుకుంటున్న అయిదేళ్ల బాబుని పిల్చి చేయి పట్టుకుని తీసుకువచ్చింది ఆయా? వాడి చేతిలో తను తెచ్చిన బిస్కట్లు, చాక్లెట్లు పెట్టి వాడ్ని కొంతసేపు ముద్దాడింది వందన. వాడి లేత బుగ్గలు నిమిరి, జుట్టు సవరిస్తూ వుంటే ఏదో తెలియని అద్భుతమైన తన్మయత్వం ఆమెలో కలగ సాగింది.

మాటలకందని మమకారం అది!

బయటకు చెప్పుకోలేని బంధం అది!...

మళ్లీ ఆటో ఎక్కి యింటికి వచ్చేసింది.

★ ★ ★

"ఏవండీ! ఇంకా నిద్రనుంచి లేవరేమిటి! ఎనిమిదయింది. మీ కాలకృత్యాలన్నీ పూర్తయ్యేసరికి ఆఫీసు టైము దాటిపోతుంది." కప్పుకున్న దుప్పటిని లాగేస్తూ అంది వందన.

"అబ్బ, వుండు వందనా! ప్లీజ్. నన్ను డిస్టర్బ్ చెయ్యకు." నిద్రమత్తు యింకా వదల్లేదు శ్రీధర్‌కి. బద్ధకంగా అటు తిరిగి పడుకున్నాడు మళ్ళీ

"అదేం పనికిరాదు. మీరు లేవాల్సిందే. వేడి వేడి కాఫీ తాగాల్సిందే." పక్కనే కూర్చుని అతని జుట్టులోనికి వేళ్లు పోనిచ్చి జుట్టు సవరిస్తూ అంది వందన.

కాఫీనా!? ఇలా ఇవ్వు. తాగేస్తాను. పళ్లు ఎక్కడికీ పారిపోవు. తర్వాత తోముకోవచ్చు."

బెడ్‌కాఫీ అలవాటు శ్రీధర్‌కి. కాని వందన పళ్లు తోముకుంటేనేగాని కాఫీ యివ్వదు.

"ముందు లేచి బ్రష్ చేసుకోండి." ముద్దుగా కోప్పడింది.

"తప్పదా!" బుద్ధిమంతుడిలా లేచాడు శ్రీధర్...

శ్రీధర్ నిజంగా బుద్ధిమంతుడే! మోసం-దగా ఏమీ తెలీవు. కల్లా-కపటం లేని మనిషి! అందుకే చిన్నప్పుడు వాళ్లమ్మ శ్రీధర్‌ని ముద్దుగా "వెట్టి నాగన్న! ఈ ప్రపంచంలో ఎలా బ్రతుకుతాడో!!" అని అనుకునేది!...

పళ్ళు తోముకోవడానికి వెళ్తున్నవాడల్లా ఆగి వందనకి దగ్గరగా వచ్చి "వందనా! ఇలా ఏరోజు కారోజు లేచీ లేవక ముందే కాఫీ కప్పుతో సహావచ్చి నీ నవ్వుమొహం చూపించడమేనా, లేక - నీ రూపం నారూపం ప్రతిబింబించే ఒక పాపనో బాబునో ఇవ్వడం ఉందా?" అని అడిగాడు అమాయకం చిలిపితనం కలిపి.

తుళ్లిపడింది వందన. తన తత్తరపాటుని పైకి కనిపించనివ్వకుండా జాగ్రత్త పడింది. ఈప్రశ్న శ్రీధర్ తమ పెళ్లయిన తర్వాత సంవత్సరం పూర్తయిన దగ్గర్నుంచీ ఏదో ఒక ధోరణిలో అడుగుతూనే వున్నాడు. పిల్లలంటే చాలా యిష్టం శ్రీధర్‌కి. పిల్లలకోసం నిజంగానే తపించి పోతున్నాడు.

వందనకి భయం పట్టుకుంది.

శ్రీధర్ అలా అడిగినప్పుడల్లా ఆమె ఏదో విధంగా టాపిక్‌ని మార్చే ప్రయత్నం చేస్తున్నాది!

పిల్లల గురించి శ్రీధర్ ప్రశ్నించినప్పుడల్లా ఆమె ఒడ్డున పడ్డ చేపలా గిలగిల్లాడి పోతున్నాది. అప్పటికి ఏదో ఒకటి చెప్పి తప్పించు కుంటున్నాది. కాని ఎన్నాళ్లు?!

రోజులు గడుస్తున్న కొద్దీ పిల్లలు యింకా కలగలేదని శ్రీధర్‌కి దిగులు ఎక్కువై పోతున్నాది. ఇరవై నాలుగ్గంటలూ శ్రీధర్‌కి అదే ఆలోచన! ఎవరి పిల్లల్ని చూసినా తనకి పిల్లల్లేరనే బాధ అతన్ని పీడించడం మొదలుపెట్టింది. వందన ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడంలేదు! ఆమెకి పిల్లలంటే యిష్టం లేదా, ఏమిటి? శ్రీధర్‌కి ఏమీ అంతుపట్టకుండా వుంది.

వందన యిరకాటంలో పడింది. ఏం చెయ్యాలో, ఎలా చెప్పాలో, ఈ సమస్యని ఎలా పరిష్కరించుకోవాలో అర్థం కావడంలేదు ఆమెకి.

"మనిద్దరం ఒకసారి డాక్టరు దగ్గరకు వెళ్లి పరీక్షలు చేయించుకుందాం. ఏమంటావు?" రాత్రి పడుకునేముందు మళ్లీ ఆ టాపిక్ ఎత్తాడు శ్రీధర్.

ఆమెకి గుండెలో రాయి పడినట్టయింది.

"ఇంకా నాలుగేళ్లేగా అయింది! ఎందుకంత తొందర?" అంది అతని ముఖంలోకి పరీక్షగా చూస్తూ.

"పెళ్లయిన సంవత్సరంలోగా ప్రొడక్షన్ మొదలు పెట్టాలని పెద్దలంటారు కదా..." అమాయకంగా నవ్వాడు.

"అబ్బ. ఇన్ని విషయాలు తెలుసా ఈ బుద్ధ భగవానుడికి!" మనసులోనే ఆశ్చర్యపోయింది వందన.

"ఇహ లాభం లేదు. దివాకర్‌ని కల్సి అన్ని విషయాలు మాట్లాడాలి." అనుకుంది.

"సరే? మీరింతలా చెప్తున్నారు కనుక వెళ్దాం. మా దేవకి వాళ్ల అన్నయ్య చాలా పెద్ద డాక్టరు. ఇలాంటి వాటిల్లో నిపుణుడు అతను. పైగా మా ఫామిలీ ఫ్రెండ్. ఆయన దగ్గరకెళ్దాం". అంది వందన.

వందనకి కంటిమీద కునుకు రాలేదు. చాలా భయంగా వుంది. ఇన్నాళ్లూ ఎంతో జాగ్రత్తగా దాచిన ఆ రహస్యం రేపు బట్టబయలు అయిపోతుంది. శ్రీధర్‌కి ఆ రహస్యం తెల్సిందంటే తన ముఖం చూడడు. ఇప్పుడెంతగా ప్రేమిస్తున్నాడో, అప్పుడంతగా ద్వేషిస్తాడు. అంతటితో ఆగడు. విడాకులిస్తాడు! ఆ రహస్యం తెల్సిపోయి నలుగురిలో నవ్వులపాలు కాకముందే తను ఏదో ఒకటి చెయ్యాలి!

"తను చచ్చిపోతే!" అన్న ఆలోచన వచ్చింది. వెంటనే అలాంటి పిచ్చి ఆలోచన వచ్చినందుకు ఆశ్చర్యపోయింది!

"చావడం పిరికివాళ్లు చేసే పని!

తను పిరికిది కాదు!

ఏ సమస్యకయినా 'చావు' పరిష్కారం కాదు, కాకూడదు!

ఎలాంటి పరిస్థితినయినా ఎదిరించి నిలువగల ధైర్యం, నమ్మకం తనకున్నాయి. అనుకుంది వందన.

'దివాకర్ అన్నయ్య'కి తనంటే ప్రాణం... యిష్టం.

"చెల్లెమ్మా!" అంటూ తన చెల్లెలు దేవకితో సమానంగా తనని చూస్తాడు. అలాంటి వాడు ఈరోజు తన జీవితం కాపాడ్డానికి ఏదైనా దారి చూపించక పోడు! తెల్లవార్లూ ఆలోచించి... ఆలోచించి తలనొప్పి మొదలైంది. లేచి ముఖం కడుక్కుని వేడి కాఫీ కలుపుకుని, టాబ్లెట్ వేసుకుని రెండు బిస్కట్లు తిని కాఫీ తాగింది.

శ్రీధర్‌ని ఆఫీసుకెళ్లనిచ్చి ఆమె దివాకర్ దగ్గరకు వెళ్లింది.

ఆలోచనలు ఆమె మనసుని దొలిచేస్తున్నాయి!...

తను... భర్తకి అన్యాయం చేస్తున్నాదా! భర్త మంచితనాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని అతని జీవితంతో ఆడుకుంటున్నాదా! తన జీవితాన్ని, తన రహస్యాన్ని కాపాడుకోవడం కోసం అతని మనసుని ఎప్పటికీ తేరుకోలేనంతగా ముక్కలు చెయ్యబోతుందా? అయ్యో... తను ఎంత పాపం మూట గట్టుకుంటున్నాది! ఒక అమాయకుడ్ని, మంచి మనిషిని మోసం చేస్తున్నాది!... ఏదో నేరం చేస్తున్న భావం ఎక్కువైపోతున్నాది. కాని శ్రీధర్‌తో తన భవిష్యత్ ఎంతో అందంగా వుంటుందన్న నమ్మకం తనకుంది. అలాంటి అందమైన భవిష్యత్తుని చేతులారా వదులుకునేటంత మూర్ఖురాలు కాదు తను.

ఆలోచనల్లోంచి తేరుకుని 'డా॥ దివాకర్' అన్న బోర్డు వున్న రూములోనికి దారి తీసింది.

"అన్నయ్యా! నా పరిస్థితి నీకు పూర్తిగా తెల్సు. నువ్వు నాకు ఈ సహాయం తప్పకుండా చెయ్యాలి. ఇది అన్యాయం అని నాకూ తెలుసు. కాని... కాని ప్రస్తుత పరిస్థితుల్లో నేను

చెయ్యగలిగింది యింతకంటె మరేమీ లేదు. బాబుని శరణాలయం నుండి తెచ్చి దత్తత చేసుకుంటాం. ప్లీజ్ అన్నయ్యా! నన్ను రక్షించు. రేపు మేమిద్దరం వస్తాం. అతనిలో లోపం వుందని నువ్వు చెప్పాలి!"

"అదేంటమ్మా! ఎలా చెప్తాను అలా! అది నా వైద్య వృత్తికే తీరని అపచారం. తప్పమ్మా, వందనా! వద్దు. అంత ఘోరమైన అబద్ధం నేను ఆడలేను. ఇంకేదైనా మార్గం ఆలోచిద్దాం."

బావురుమంది వందన.

"ఇది తప్ప మరోమార్గం లేదన్నయ్యా. ప్లీజ్!"

ఆఖరికి వందన బాధ చూడలేక ఒప్పుకున్నాడు దివాకర్.

"కాని... వందనా! ఒక మంచి మనిషికి అన్యాయం చేసానన్న బాధ నిన్ను జీవితాంతం వెంటాడుతూనే వుంటుంది. బాగా ఆలోచించుకో."

తప్పు చేసిన దానిలా తలదించుకుంది ఒక్క నిముషం. కాని వెంటనే, సర్దుకుని కన్నీటిని తుడుచుకుంటూ అర్థింపుగా అంది వందన: "ఆలోచించాను అన్నయ్యా! సమయం వచ్చినప్పుడు నా గతం అతనికి చెప్పి క్షమించమని అడుగుతాను. కాని ప్రస్తుతం... నువ్వు నేను చెప్పినట్టు చెయ్యి, ప్లీజ్!"

★ ★ ★

శ్రీధర్, వందన; ఇద్దరూ హాస్పిటల్‌కి వెళ్లారు.

వందన గుండెలు పీచు పీచుమంటున్నాయి. ఇంతగా ప్రాధేయపడినా కూడా దివాకర్ తన వృత్తి నీతికి కట్టుబడి శ్రీధర్‌లో ఏలోటూ లేదని చెప్పేస్తాడేమోననీ; తన గురించిన ఆ చేదు నిజం బయట పెట్టేస్తాడేమోననీ.

సీలింగు ఫాను స్పీడుగా తిరుగుతున్నా ఆమెకి ముచ్చెమటలు పోస్తున్నాయి!

"శ్రీధర్ గారూ! మీరేమనుకోనంటే మీకో విషయం చెప్తాను." నెమ్మదిగా మొదలు పెట్టాడు దివాకర్.

"చెప్పండి" అన్నాడు శ్రీధర్ కొంచెం ముందుకు వంగుతూ.

"సారీ! శ్రీధర్ గారూ! మీ శెమెన్ టెస్ట్‌లో స్పెర్మ్ కౌంట్ నిల్ అని వచ్చింది. మీకు పిల్లలు పుట్టడానికి ఛాన్సులు చాలా తక్కువ. అయామ్ వెరీ సారీ!" అంతటి అబద్ధం చెప్పడానికి దివాకర్, గుండెని ఎంతో దిటవు చేసుకోవల్సి వచ్చింది. ఒక ఆడపిల్ల జీవితం అల్లరిపాలు కాకుండా వుండడం కోసం అంత సాహసం చేసాడు అతను. తర్వాత వచ్చే పరిణామాల్ని ఎదుర్కోవడానికి కూడా సిద్ధపడ్డాడు!

విషయం విని తుళ్లిపడ్డాడు శ్రీధర్. ప్రాణంలేని శిలలా బిగుసుకుపోయాడు. వచ్చేస్తుంటే భర్త వెనకగా నడుస్తున్న వందన వెనక్కి తిరిగి శ్రీధర్ చూడకుండా రెండు చేతులూ జోడించి నమస్కరించింది దివాకర్‌కి.

★ ★ ★

"అనాధ శరణాలయంనుండి ఎవరినైనా బాబుని తెచ్చుకుని పెంచుకుందాం. ఎలాగూ మనకు పిల్లలు పుట్టే యోగం లేదు కదా." నైరాశ్యం అంతా కుప్ప పోసినట్టుగా అన్నాడు.

ఆనందమో... విషాదమో తెలియని అవస్థ వందనది.

"సరే. కాని... నాదొక చిన్నమాట."

"ఏంటది?"

"బాబుని పెంచేది నేను కదా, నాకు నచ్చిన బాబుని తెచ్చుకుందాం."

"అలాగే" నిర్లిప్తంగా అన్నాడు శ్రీధర్.

మర్నాడు గాంధీ అనాధ శరణాలయంకి తీసుకు వెళ్లింది భర్తను. వాళ్లందర్నీ చూస్తూంటే శ్రీధర్‌కి చాలా జాలి కలిగింది.

"కావాలనుకున్న వాళ్లకి ఆ దేవుడు పిల్లల్ని యివ్వడు!

వద్దని వదిలించుకునే వాళ్లకే పిల్లల్ని యిస్తాడు!

ఆ దేవుడి దృష్టిలో 'న్యాయం' అంటే యిదేనేమో?- అనుకున్నాడు బాధగా.

శరణాలయం వాళ్లతో ముందుగా చెప్పి వుండడంవల్ల పెద్దగా ప్రాబ్లం ఏమీ రాలేదు వందనకి.

'అభి' ని యింటికి తెచ్చారు యిద్దరూ.

బాబుని చూసాక శ్రీధర్‌కి పట్టరాని ఆనందం కలిగింది. శ్రీధర్ బాబుని ఎంతో గారాబంగా, మురిపెంగా చూసుకోవడం మొదలెట్టాడు. వాడికోసం మంచి డ్రస్సులు, మంచి బొమ్మలు, రకరకాల చాక్‌లెట్లు తీసుకువచ్చాడు. ఆఫీసుకి నాలుగు రోజులు శలవు పెట్టి యింట్లోనే వున్నాడు వాడితో ఆడుకుంటూ.

★ ★ ★

వందనకి మాత్రం నిత్యజీవితం పూలతేరులా ఉన్నా, క్షణక్షణం గతం... కళ్లముందు కదిలి... పుండు సలిపినట్టు బాధ.

గతంలో... అరవింద్ అమెరికాలో డాక్టరు! వందనని చూడగానే యిష్టపడ్డాడు. వందన చురుకుతనం, సమయస్ఫూర్తి అతనికి బాగా నచ్చేయి. అరవింద్ ఆమెతో చాలాసేపు ఒంటరిగా మాట్లాడాడు. జీవితం పట్ల ఆమెకున్న అభిప్రాయాలు, ఆమె భావాలు, యిష్టాయిష్టాలు అన్నీ అతనితో చెప్పింది వందన. పెళ్లి చూపులకి అరవింద్‌తో పాటు, అతని అక్క, బావ వచ్చారు. వాళ్లది రాజమండ్రి దగ్గర 'లక్కవరం'ట. అరవింద్‌కి అక్క-భావ తప్పించి యింకెవ్వరూ 'నా' అన్నవాళ్లు లేరన్నారు. బరువు-బాధ్యతల్లేని మంచి సంబంధం అని సంతోషించారు, వందన తల్లిదండ్రులు! పెళ్లి చూపులయిన వెంటనే ఆషాఢమాసం రాకముందు నిశ్చితార్థం కూడా చేసేసుకున్నారు మగపెళ్లివారు. అరవింద్‌కి అలాంటి పట్టింపులు లేవు. ఆషాఢంలో నా పెళ్లి జరిపించెయ్యమన్నాడు. కాని వందన తల్లిదండ్రులు అందుకు వప్పుకోలేదు. "ఆషాఢ మాసంలో పెళ్లేమిటి?" అన్నారు.

అరవింద్ వందనని, విశాఖపట్నానికి దగ్గరగా వున్న ముఖ్యమైన, అందమైన ప్రదేశాలన్నిటికీ తీసుకొని వెళ్లాడు. వందన కూడా ఏమాత్రం బిడియపడకుండా ఎలాగూ కాబోయే భర్తే కదా అని ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లింది. ఒకరోజు వందనకి తెలియకుండా హోటల్ దసపల్లాలో రూమ్ తీసుకున్నాడు. వందన ఆ రూము చూసి ఆశ్చర్యపోయింది. 'ఇదేంటి, ఇలా...?' అంది అయోమయంగా చూస్తూ.

"వందనా! ఎందుకు భయపడతావు? నువ్వెంతో ధైర్యం గల దానివి కదా! అలా మాట్లాడతావేం? అయినా నిశ్చితార్థం జరిగిపోతే పెళ్లి అయిపోయినట్టే! నువ్వు నాతోనే కదా వచ్చావు?! ఎవరో పరాయి మగాడితో రాలేదు కదా! డోంట్ బి సిల్లీ!" అంటూ మంచి మాటలు చెప్పి దగ్గరకు తీసుకున్నాడు. అమెరికాలో వున్నాడు కదా. అక్కడ అమ్మాయిలు చాలా ఫాస్ట్. ఇప్పుడు అతను చెప్పినట్టు వినకపోతే రేపు పెళ్లయ్యాక ఆటపట్టిస్తాడేమో అనుకుని అతని చేష్టలకి బెరుగ్గా వున్నా లొంగిపోయింది వందన!

ఆ తరువాత పెళ్లిముహూర్తం విషయంలో కొంత తేడా వచ్చింది. అరవింద్ చాలా ఆదుర్దాగానూ ఆపేక్షగానూ వెంటనే పెళ్ళి జరగాలన్నాడు. తనకికూడా ఆ భావంపట్ల ఇష్టం కలిగి సంతోషించింది. కాని, అటు అరవింద్ 'అక్కగారు, బావగారు'గాని, ఇటు తన తల్లిదండ్రులుగాని - 'ఆషాఢ మాసంలో 'పెళ్ళి'- అనే ఆలోచనకే ఒప్పుకోలేదు. అరవింద్ 'మళ్లీ - రెండు నెలలా' అని విసుక్కుంటూ అమెరికా వెళ్లిపోయాడు.

క్రమంగా వందనకి వంట్లో నలత. కాని ప్రతీ దానికీ డాక్టరు దగ్గరకు ఎందుకు పరుగెత్తడం అని ఊరుకుంది. తనకు నెల తప్పిన విషయం ఆమెకే చాలా ఆలస్యంగా తెలిసింది. ఆ విషయం యింట్లో చెప్తే ఏం రాద్ధాంతం చేస్తారోనని చెప్పలేదు. అమెరికాకి ఫోన్ చెయ్యాలని ప్రయత్నించింది. కాని లైన్ దొరకలేదు. అలా నాలుగు నెలలు గడిచిపోయాయి. అయిదో నెలకూడా గడిచి తన శరీరంలో ఏర్పడుతున్న మార్పులు చూస్తూంటే గుండె జారిపోయింది. అంత ధైర్యం నీరుగారి పోయింది. ఐదు నెలలు వెళ్లాక ఏడ్చుకుంటూ తల్లిదండ్రులకి చెప్పింది.

వందన తండ్రి సుదర్శనరావుగారు ఈ సంగతంతా అరవింద్ అక్క, బావలకి చెప్పాలని వాళ్లిచ్చిన అడ్రసు పట్టుకుని వెళ్లారు. కాని, అసలు అలాంటి వ్యక్తులెవ్వరూ అక్కడ లేరని తేల్చి చెప్పేరు చుట్టు పక్కల వాళ్లు. సుదర్శనరావుగారు హతాశులయ్యారు. ఇంటికొచ్చి జరిగింది చెప్పారు.

పోలీసు రిపోర్టు యిచ్చాక తెలిసింది- వాళ్లు ముగ్గురూ యిలా ఎంతోమందిని మోసం చేసారని, అమ్మాయిలని అనుభవించడానికి యిది ఆ 'అరవింద్' వేసిన ప్లాన్ అని; అసలు అతని పేరే అరవింద్ కాదని; అమెరికా లేదు, ఆవకాయ లేదు... అసలు అతను డాక్టరే కాదని... వగైరా వివరాలన్నీ తెలిసాయి!

వందన తల్లి కుప్ప కూలిపోయింది. వందన కూడా బెంబేలెత్తిపోయింది. అయినా వెంటనే తేరుకుని దివాకర్ దగ్గరకు పరుగెత్తింది. కాని అప్పటికే ఆలస్యం అయిపోయింది.

వందనకి అప్పటికి ఆరవ నెల. అబార్షన్ చేస్తే తల్లికీ-బిడ్డకీ కూడా ప్రమాదం అని బాగా పేరున్న గైనకాలజిస్ట్ డా॥దివాకర్ చెప్పాడు. వందనకి అన్నయ్య వంటివాడు. చాలా మంచివాడు.

వందన ప్రాణ స్నేహితురాలు దేవకికి స్వయానా అన్నయ్య! వందనకి జరిగిన అన్యాయం విని దేవకి చాలా విచారించింది. వాళ్లిద్దరూ వందనని కష్ట సమయంలో ఆదుకున్నారు. వందన ఏదో ట్రైనింగ్ కోసం కర్నూలు వెళ్తున్నాని చెప్పి దేవకి యింటికి వచ్చి పురుటికి ముందూ తరువాతా ఏడు నెలలు అజ్ఞాతవాసం గడిపింది. మగపిల్లవాడు.

తాను పుట్టడం ఆరోగ్యంగానే పుట్టినా వందనకి పురుటి రోజుల్లో ఒక క్లిష్ట పరిస్థితి రావడంతో గర్భకోశాన్ని తొలగించాల్సి వచ్చింది.

బాబుని 'గాంధీ శరణాలయం'లో చేర్చారు. ఆ తర్వాత వందన మామూలుగా యింటికి వచ్చేసింది. ఉద్యోగంలో చేరింది. కాని అప్పట్నుంచీ ఆమె దిగులుగా, ఏదో పోగొట్టుకున్న దానిలా వుండడం మొదలెట్టింది. ఎలాంటి పిల్ల ఎలా అయిపోయిందని వందన తల్లిదండ్రులు బెంగపెట్టుకున్నారు. ఆమెలో పూర్వపు ఉత్సాహం, చురుకుదనం మాయమైపోయాయి. జీవితంపట్ల విరక్తి ఏర్పడింది.

సరిగ్గా అలాంటి సమయంలోనే మరో సంబంధం వచ్చింది. "నేనసలు పెళ్లే చేసుకోను." అని మొండిపట్టు పట్టింది వందన. ఆమె తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకున్నారు. నచ్చజెప్పారు.

"ఈ జీవితం ఎంతో చిన్నది! పోగొట్టుకున్న దానిని పొందలేవు. అందిన దానిని పోగొట్టుకోవడం అవివేకం అవుతుంది." అని! వందనకి బాబు మనసులో మెదిలేడు. మనసంతా మెలి తిప్పినట్టుగా అయింది. అయినా విధి లేక పరిస్థితులకు తలవంచి జీవితంతో రాజీపడిపోయి శ్రీధర్‌తో పెళ్లికి అంగీకరించింది. ఆమె అదృష్టం బాగుండి శ్రీధర్‌లాంటి అమాయకుడు, మంచి వ్యక్తి, సహృదయుడు ఆమెకు భర్తగా లభించాడు!...

ఇలా జ్ఞాపకాలు తెచ్చుకుంటూ ఉండగా చిన్న మాగన్నునిద్ర ముంచుకొచ్చింది వందనకి.

ఆ మగత ఆలోచనల్లోంచి తేరుకుని చూసే సరికి శ్రీధర్ బాబుకి అన్నం తినిపిస్తున్నాడు. వాళ్లిద్దర్నీ అలా చూస్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది వందనకి!

నీళ్లు నిండిన ఆమె కళ్లకు వాళ్లిద్దరూ మసగ్గా కనిపించారు! వందనకి ఆనందం పశ్చాత్తాపం ఒకేసారి కలిగాయి. జరిగినదంతా శ్రీధర్‌కి చెప్పెయ్యాలని, అతని కాళ్లు పట్టుకుని క్షమాభిక్ష అడగాలని అనిపించింది వందనకి! "ఏమిటో ఈ ఆనందం... చెప్పలేక పోతున్నాను." అంది.

"నేను డిసైడు చేసేసేను. మనం 'అభీ'ని డక్టర్ని చెయ్యాలి. దివాకర్ గారంత గొప్ప డాక్టర్ని చెయ్యాలి. యెస్. అతను గొప్ప డాక్టరే కాదు. గొప్ప వ్యక్తికూడాను..." అన్నాడు శ్రీధర్; కళ్లు మూసుకుని, రెండు చేతులూ జోడించి.

"అవును... గొప్పవ్యక్తి..." అనుకుంది, వందన; తన నమస్కారాన్ని మనసులోనే దాచుకొని.

★ ★ ★

*(అముద్రితం)*